# కూటికి పేదలమైతే....

ఇంకా బాగా తెల్లారలేదు. కనుచీకటిగావుంది. ఉదయం సుమారు ఐదుగంటలు కావస్తోంది.

తక్కిన అందరుకష్టజీవుల్లా నాలుగు గంటలకే లేచిననర్సి తన యింటిపనులు కొన్ని చక్కబెట్టుకుని కరణాల యింటికి బయలుదేరింది.

కరణం నారాయణమూర్తి నిజంగా గ్రామకరణం కాకపోయినా, తన నియోగత్వం వల్లా ఆస్తి ఆధిక్యతవల్లా గ్రామముల్లో గొప్పతనం సంపాయించుకుని గ్రామపెద్ద అయ్యాడు.

రోజూ నర్సివొచ్చేవేళకి కరణాల ఇంట్లో ఎవరూ లేచేవారు కాదు. ఇంటిల్లిపాదీ లేచేటప్పటికి ఏడన్నా కొట్టకమానదు. కాని ఈవేళ ఎందుచేతో ఇల్లుకొంచెం హడావుడిగా కనుపిస్తోంది.

తక్కిన కొన్ని యిళ్ళ ముందర పాచి వూడ్చుకున్నారు. కొందరు ఇంకా పేణ్ణీళ్లు జల్లుతున్నారు. మరికొందరు లేవనేలేదు.

అరుగుమీద కరణంగారి కడసారమ్మాయి సుశీలా, రెండో కొడుకు రామం వున్నారు. పళ్లుతోముకుంటో.

నర్సి మామూలుగా అరుగుపక్క కిటికీలో వున్న చీపురుతీసింది. వీధి తుడవడానికి.

అప్పుడే రామం అన్నాడు, “అదుగో దొంగ మొగం; అడక్కుండానే తెలుస్తోంది; మిడిగుడ్లేసుకుని ఎట్లా చూస్తోందో!”

ఆ మాటలు నర్సికి స్పష్టంగా వినపడ్డాయి. ఒకసారి తలెత్తి వాళ్ళని చూసి తన్నేమో అనుకుని భయపడి, చుట్టుపక్కలకి చూసి మళ్లా పనిలో మునిగింది.

సుశీల అంది: “అట్లా అనకురా! మనకెందుకూ?” అని. కాని రామం వినలేదు. మొహం కడుక్కుంటున్న చెంబు అక్కడే గిరవాట్టేసి, “నర్సిముండొచ్చింది. నాన్నోయ్!” అని అరుచుకుంటో లోపలికి పోయాడు.

నర్సికి అర్థంకాక తెల్లబోయి అతను వెళ్ళినదారిని చూస్తో నిలబడింది; ముఖంమాత్రం కోపంతో కందిపోసాగింది.

సుశీల దాన్ని జాలిగా చూస్తోంది.

అంతట్లోకి నారాయణమూర్తిగారూ, ఆయన బావమరిది కనకయ్యగారూ ఇవతలకి వచ్చారు.

"ఇటురావే!" అన్నాడు బావమరిది. చీపురు క్రింద పడేసి రెండడుగులు ముందుకేసింది నర్సి, అమాయకంగా చూస్తూ.

"ఏవేం, న్యాయంగా దారిలోకి వస్తావా? పోలీసుల్ని తీసుకురమ్మన్నావా?" నారాయణమూర్తిగారు గాంభీర్యంగా అన్నారు.

"ఏటండి, అసలు?"

"చూడు బావా, ఎట్లా అమాయికత్వం నటిస్తోందో! అది సామాన్యురాలు కాదు. ఇట్లాంటి వెన్ని 'స్వాహా' మనిపించిందో!" బావమరిది మళ్ళీ అన్నాడు.

"నేనేం ఎరగనండి" అని నసిగి చీపురు తీసుకోబోయింది, నర్సి.

"పూర్తిగా సమాధానం చెప్పి మరీ, చీపురుముట్టుకో" బావమరిది అరిచాడు. నర్సి అట్లానే నిలబడుంది.

"న్యాయంగా వెండిగిన్నె తెచ్చి ఇచ్చేసి, మామూలుగా నీపని నువ్వు చేసుకుంటావా? లేకపోతే జయిలుకి వెడతావా? రెండే మాటలు" మళ్ళి నారాయణమూర్తిగారు ఒక్కొక్క మాటే వొదుల్తూ అన్నారు, శాంతంగా.

జయిలు మాట వినగానే నర్సి కొంచెం వొణికింది. కాని పైకి అంది:

"ఏం వెండిగిన్నండి? నేనేం ఎరగనని చెప్పలేదడండీ?"

"ఆ మాటలకేంలే! నిన్న వొడిలో వేసుకుని ఎత్తుకు పోతుంటే నేను చూళ్ళేదనుకున్నావా?" ఈ మాటలు అన్నది బావమరిది కనకయ్యగారు.

నర్సి ఆయన్ని చూపుల్తో కాల్చేసేటంత కోపంగా చూసింది.

"వొళ్ళోనా? మీరు చూశారా?" ఎదురుప్రశ్నించింది.

"అవును, ఆయన చెప్పటంలేదూ?" కరణంగారు అన్నాడు.

"అసలు నిన్న వొళ్ళో వేసుకొని నేనేంపట్టుకెళ్ళలేదండి, బాబూ" ప్రార్థన పూర్వకంగా అంది నర్సి.

"లేకపోతే ఎక్కడ పెట్టుకుని పట్టుకెళ్ళావు?" క్రాసు పరీక్ష చేశాడు బావమరిది. నవ్వుతూ బావగారికేసి చూశాడు, తన తెలివితేటల్ని గమనించమన్నట్టు.

"నేనేది ఎరగను" రెట్టించింది నర్సి. తర్వాత పోట్లాడకుండా, గబగబా నడిచి తన ఇంటివైపు పోసాగింది.

"అది తియ్యలేదేమో" కరణం అన్నాడు, నసుగుతో.

"తియ్యకపోతే ఏమవుతుంది? ఆవక పోలీసుల్ని పిలిపించు" అన్నాడు బావమరిది.

## 2

సాయిత్రం ఇద్దరు పోలీసులువచ్చారు. నౌఖరుని తోడిచ్చి పంపించి కరణంగారు నర్సిఇల్లంతా వెతికించాడు. నర్సి ఇంటి పక్కల వాళ్ళు ముక్కుమీద వేలేసుకున్నారు "కులానికి ఎంత ఖ్యాతి తెచ్చావే?" అని.

పోలీసులు వెళ్ళిపోయాక వెక్కి వెక్కి ఏడుస్తోపడుకుంది నర్సి. పొలంనుంచి వొస్తో ఈ

వార్తవిన్న, వెంకన్నకి చాలా కోపం వొచ్చింది. భార్యమీద కాని, ఇంటికివస్తే పరిస్థితులు వేరుగా వున్నాయి.

భార్యని రేపట్నించీ వాళ్ళింటికి పనిలోనికి పోవద్దని వారించాడు.

కరణాల యింట్లో మాత్రం గిన్నె నర్సే దొంగిలించిందనే అనుమానం పోలేదు.

"ఎక్కడో దాచేసివుంటుందనుకున్నారు. పోలీసుల కోసం రెండు రూపాయలు ఖర్చు!

## 3

మర్నాడు వేణ్ణీళ్లు కాచడానికని ఉదయమే కొబ్బరి డొక్కలకోసం పోయిన కరణంగారి పెద్దమ్మాయి శారద, వాటి మధ్యనుంచి వెండిగిన్నె తీసుకువచ్చింది.

అంతా "ఇక్కడ దాచిపెట్టిందర్రా! అందరూ మర్చిపోయాక తీసుకుపోదామని" అనుకున్నారు.

అప్పుడు రామానికి ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది. వెండి గిన్నెలో పరవాణ్ణం తనని తిననియ్యలేదని, సుశీలమీద కోపం వచ్చి, ఆగిన్నెతనే అక్కడ దాచిపెట్టాడు. అనవసరంగా దాసీ దీనిమీద నేరం మోపించానుకదా? అనిలోపల విచారించాడు.

కాఫీ తాగడం అయ్యాక తల్లిని మూలకిపిల్చి అసలు సంగతి చెప్పాడు.

"చేస్తే చేశావులే, నోరుమూసుకూరుకో వెధవా!" అని అతన్ని కేకలేసి, ఈ సంగతి భర్తకి చెప్పింది.

నారాయణమూర్తి నర్సికోసం కబురుపంపాడు. నర్సి భర్త వెంకన్న వచ్చాడు. వాళ్ళమీద లేని దొంగతనంకట్టిన మూలాన తన భార్య పనిలోకిరాదని ఖచ్చితంగా చెప్పాడు. అతని అమాయిక హృదయానికి నొప్పి కలిగినందువల్ల కళ్ళ వెంబడి నీళ్లు కూడా వచ్చాయి.

"క్షమించాలి" అని వెళ్లిపోసాగాడు.

అప్పుడు కరణంగారు అన్నారు:

"పోయిందేదో పోయింది. దానికి మేం విచారించటం లేదులే. అదిపోతే, కొత్తది చేయించుకుంటాం. మీరు తియ్యలేదంటున్నారు కదా, పోనీ మీ మాటే నమ్ముతాం. నర్సిని వెంటనే పనిలో చేరమను. పైన భగవంతుడున్నాడు వాడి కళ్లు మనమెవ్వరం ముయ్యలేం కదా!"

కొంచెం వేదాంతం ప్రవహించింది.

వెంకన్న "మీరు సులువుగా అలా దొంగతనాలు మాత్రం కట్టకూడదు. కూటికి లేకపోతే పస్తుంటాం. బట్టలేకపోతే మీలాంటివాళ్ళని ముష్టి అడుగుతాం. అంతేకాని దొంగతనం మాయింటా వంటా లేదు" అన్నాడు.

"సరేపో, నర్సిని రమ్మను" అని లేచి లోపలికిపోయారు కరణంగారు.